క్లుప్తంగా

వ్యక్తికి గాయాలు

కడప అర్బన్ : కడప నగరంలోని కోటిరెడ్డి సర్కిల్‌లో వున్న ఓ చెట్టు కొమ్మ శుక్రవారం సాయంత్రం వీచిన గాలికి విరిగి పడింది. ఆ సమయంలో అదే చోట పండ్లను కొంటున్న చిన్న సుబ్బరాయుడు అనే మున్సిపల్ కార్మికుడు గాయపడ్డాడు.

మట్కా బీటర్ అరెస్ట్

కడప అర్బన్: కడప నగరంలోని పాతబస్టాండ్ సమీపంలో శుక్రవారం సాయంత్రం కమలాపురం మండలం దేవరాజుపల్లికి చెందిన పసుపుల సుబ్బారెడ్డి అనే వ్యక్తి మట్కా రాస్తుండగా సీఐ భాస్కర్‌రెడ్డి తమ సిబ్బందితో కలిసి అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి మట్కా స్లిప్‌తో పాటు రూ.10,500 నగదును సీజ్ చేశారు.

త్వరలో డీఎస్పీలు, సీఐల బదిలీలు..!

కడప అర్బన్ : రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రదేశాల్లో డీఎస్పీలుగా, సీఐలుగా పనిచేస్తున్న వారిని నేడో, రేపో బదిలీ చేసేందుకు ఉన్నతాధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను త్వరలో విడుదల చేస్తారని పోలీసు వర్గాల ద్వారా వచ్చిన విశ్వసనీయసమాచారం.

పోస్టల్ ఆర్డర్ ధర తగ్గించాలి



మాట్లాడుతున్న ఆర్‌సీపీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు మడగలం ప్రసాద్

కడప వైఎస్ఆర్ సర్కిల్ : గతంలో ఐదు, పది రూపాయల పోస్టల్ ఆర్డర్ ద్వారా సమాచార హక్కు చట్టం పెట్టి సమాచారాన్ని తెలుసుకునే వాళ్లమని.. ప్రస్తుతం నూరు, యాభై రూపాయలు లేనిదే పోస్టల్ ఆర్డర్ పొందలేకున్నామని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు మడగలం ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని ఆర్‌సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రమైన ప్రధాన, ఇతర తపాలా కార్యాలయాలలో పోస్టల్ ఆర్డర్లు ద్వారా చిన్నచిన్న సమాచారం తెలుసుకోవడానికి కూడా వందల రూపాయలను వెచ్చించాల్సి వస్తోందన్నారు. సంబంధిత తపాలా శాఖ అధికారులు దీనిపై స్పందించి ధర తగ్గించాలని కోరారు. కాగా ఈ విషయమై సంబంధిత అధికారులను వివరణ కోరగా జిల్లా వ్యాప్తంగా పది రూపాయలు, రూ.20 రూపాయల పోస్టల్ ఆర్డర్లు కొరత ఉందని, ఈ విషయాన్ని సూపరింటెండెంట్ దృష్టికి తీసుకుపోయి కొరతను భర్తీ చేస్తామన్నారు.

పీఆర్‌టీయూలో పలువురు చేరిక



పార్టీలో చేరిన నాయకులతో పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

కడప ఎడ్యుకేషన్ : కడపలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో శుక్రవారం చింతకొమ్మదిన్నె మండలానికి చెందిన పీఆర్‌టీయూలోని ఓ వర్గం సీనియర్ నాయకులు పీఆర్‌టీయూలోని మరో వర్గంలో చేరారు. పీఆర్‌టీయూ రాష్ట్ర సీపీఎస్ కన్వీనర్ గుజ్జల తిరుపాల్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బండి విశ్వనాథ రెడ్డి, మోపూరి వెంకట శివారెడ్డిల ఆధ్వర్యంలో పలువురు నాయకులు పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మిట్టా క్రిష్ణయ్య, ఎంఎం గిరి ప్రసాద్‌రెడ్డి, పీఆర్‌టీయూ ఉత్తరాంధ్ర మాజీ శాసనమండలి సభ్యులు గాదె శ్రీనివాసులనాయుడు సమక్షంలో పీఆర్‌టీయూ సంఘంలో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విశ్వనాథరెడ్డి, మెపూరు శివారెడ్డిలతో కలిసి జిల్లాలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కార సాధనకు అందరూ కలిసి పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సికెదిన్నె మండల అధ్యక్షులు శ్రీనివాసులు, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులు, అగీరప్ప, ఆజీమ్, కరంతుల్ల, సమద్, చిట్టిబాబు, రమణ, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకాభివృద్ధికి సహకరించండి



జేసీ అదితిసింగ్‌ను సత్కరిస్తున్న దృశ్యం

కడప కల్చరల్ : జిల్లాలోని వారసత్వ పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి తమ ఇంటాక్ సంస్థ కృషి చేస్తోందని, మీ సహకారం కోరుతున్నామని ఇంటాక్ జిల్లా చాప్టర్ కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి జేసీ అదితిసింగ్‌ను కోరారు. జిల్లాకు నూతన జేసీగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఇంటాక్ సంస్థ సభ్యులతో కలిసి ఆయన జేసీని కలిసి పుష్పగుచ్ఛం సమర్పించి సత్కరించారు. కార్యక్రమంలో సభ్యులు పార్వతమ్మ, సంజీవరెడ్డి, బాల యల్లారెడ్డి, వెల్లాల వెంకటేశ్వరాచారి, భారవి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు బాగుచేయండి సారూ..!





దెబ్బతిన్న డీఎస్ఏ స్టేడియంకు వెళ్లే రహదారి

కడప నగరంలోని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ మైదానానికి వెళ్లే రహదారి పాడైపోయింది. ఇటీవల కాలంలో వాహనాల రాకపోకలు ఎక్కువ కావడంతో రోడ్డు దెబ్బతింది. నిత్యం వందల సంఖ్యలో క్రీడాకారులు, వాకర్స్ ప్రయాణం చేసే రహదారి దెబ్బతినడంతో వాహనదారులకు ఇబ్బందిగా మారింది. అధికారులు స్పందించి రోడ్డును బాగుచేయాలని క్రీడాకారులు కోరుతున్నారు.

– కడప స్పోర్ట్స్

విశ్వవిద్యాలయంలో విభాగాలను తనిఖీ చేసిన రిజిస్ట్రార్

వైవీయూ న్యాయవిభాగంతో సమీక్ష



న్యాయవిభాగంతో చర్చిస్తున్న రిజిస్ట్రార్

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయంలోని పలు విభాగాలను వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి తనిఖీ చేశారు. ట్రాన్స్‌పోర్ట్ విభాగానికి వెళ్లి రికార్డులను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం విశ్వవిద్యాలయ అతిథి గృహాలను, ఇంజనీరింగ్ విభాగాన్ని పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. విశ్వవిద్యాలయ పరిపాలన భవనంలో లీగల్ సెల్ (న్యాయవిభాగం)తో సమీక్షించారు. ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి ఆగస్టు నెల మొదటి వారంలో విశ్వవిద్యాలయాల్లో నెలకొన్న న్యాయ పరమైన అంశాల పట్ల సమీక్షించనుండటంతో ఈ మేరకు సెల్ డైరెక్టర్ డాక్టర్ జయంత్ కశ్యప్, డిప్యూటీ రిజిస్ట్రార్ శివారెడ్డి తో కలిసి చర్చించారు. అనంతరం ఫుడ్ టెక్నాలజీ విభాగాన్ని తనిఖీ చేసి రికార్డులను, అంతర్గత రహదారుల పనులను పరిశీలించారు.

ఏఎఫ్‌యూలో విభాగాల తనిఖీ



స్టోర్‌రూంను తనిఖీ చేస్తున్న వీసీ ఆచార్య జి. విశ్వనాథకుమార్

ఏఎఫ్‌యూ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలోని 3డీ ల్యాబ్‌ను, వసతిగృహాలను విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య జి. విశ్వనాథ కుమార్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి భోజనం నాణ్యత, రుచి గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించడంతో పాటు పరిశుభ్ర వాతావరణంలో వంటలు చేయాలని ఆదేశించారు. వంటచేయడంలో నిర్లక్ష్యం, అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం వంటగది, స్టోర్‌రూం, ఇతర గదులను పరిశీలించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్‌రెడ్డి, వార్డెన్ విద్యానంద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మంత్రికి సమస్యలను విన్నవిస్తున్న ఏపీ పీటీడీ కార్మిక పరిషత్ నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తోడ్పాటు అందించాలని ఏపీ పీటీడీ కార్మిక పరిషత్ యూనియన్ నాయకులు కోరారు. విజయవాడలో వారు రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 53 డిపోలకు నైట్ అవుట్ అలవెన్స్‌లు ఇవ్వడం లేదని మంత్రికి వివరించామన్నారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించి త్వరలో సమస్యలన్నీ పరిష్కరిస్తారని హామీ ఇచ్చారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి యం. పురుషోత్తం, రాష్ట్ర కోశాధికారి కోసూరి సురేంద్ర, డిపో కార్యదర్శి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

రెండిళ్లలో చోరీ

ఖాజీపేట : ఖాజీపేటలోని అగ్రహారంలో శుక్రవారం తెల్లవారుజామున రెండు చోరీలు జరిగాయి. గుండ్లకంట జయరాము ఇంటిలో చోరీ జరిగింది. ఇంటి వద్ద పంచలో నిద్రపోతుండగా దొంగలు ఇంటి వెనుక ఉన్న తలుపు పగులగొట్టి లోపలికి వెళ్లి రూ. 26,200 నగదు, రెండు బంగారు చైన్లు, 2 జతల కమ్మలు, మాటీలు చోరీ చేశారు. కొత్త బట్టలు 10 జతలు ఎత్తుకు పోయారు. పక్కనే ఉన్న గుండ్లకంట చిన్నక్క ఇంట్లో దొంగలు పడ్డారు. ఇంట్లో ఉన్న 10 జతల చీరలు, 10 వేల పింఛన్ డబ్బులు ఎత్తుకు పోయారు. చిన్నక్క తన కూతురు ఊరికి పోవడంతో మనవరాళ్లు ఒంటరిగా ఉంటారని తాళం వేసి గురువారం రాత్రి కూతురు ఇంటకి వెళ్లింది. ఇంటి వెనుక భాగం నుంచి వచ్చి చోరీ చేశారు. చోరీ జరిగిన ఇంటికి పోలీసులు వెళ్లి పరిశీలించారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రొద్దుటూరు : సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ మురళీధర్ తెలిపారు. స్థానిక శ్రీవెంకటేశ్వర పశువైద్య కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు సైబర్ నేరాలు, డ్రగ్స్ అడిక్ట్, యాంటి ర్యాగింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఎస్పీ మాట్లాడుతూ చాలా మంది మహిళలు సోషల్ మీడియా ప్రభావం వల్ల లైంగిక వేధింపులకు గురవుతున్నారన్నారు. ఇటీవల కాలంలో అనేక సంఘటనలు జరిగాయని తెలిపారు. ఇందుకు సంబంధించి పోలీసు శాఖ ప్రత్యేకంగా సైబర్ క్రైం విభాగాన్ని ఏర్పాటు చేసిందన్నారు. చాలా మంది మొబైల్ ఫోన్లలో ఆన్‌లైన్ గేమ్‌లు, యాప్‌ల ద్వారా నష్టపోతున్నారన్నారు. కార్యక్రమంలో సైబర్ క్రైం జిల్లా సీఐ ఎల్.జీవన్‌రెడ్డి, రూరల్ సీఐ కె.రమణారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసప్రసాద్, ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ ఇందిరా, డాక్టర్ జ్యోతి, డాక్టర్ పాండు రంగారెడ్డి, డాక్టర్ గాయత్రి పాల్గొన్నారు.

సోషల్ మీడియాపై అప్రమత్తత అవసరం

మైదుకూరు : సోషల్ మీడియా పట్ల విద్యార్థినులు అవగాహన పెంచుకోవాలని మైదుకూరు డీఎస్పీ వెంకటేశులు అన్నారు. శుక్రవారం స్థానిక కస్తూరిబా గురుకుల పాఠశాలలో సోషల్ మీడియాపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సోషల్ మీడియాలో భాగమైన ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, వాట్సాప్‌ల్లో వ్యక్తుల పరిచయాలతో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ సందర్భంగా తాము తయారు చేసిన ఫ్లవర్ వాజులు, జ్ఞాపికలను కస్తూరిబా విద్యార్థినులు డీఎస్పీ, ఇతర అధికారులను అందజేశారు. కార్యక్రమంలో అర్బన్ సీఐ ఏపీ మస్తాన్, కస్తూరిబా ప్రిన్సిపాల్ నిర్మల పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత



పాత బస్టాండ్‌లో పరిసరాలను శుభ్రం చేస్తున్న విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్ : పరిసరాల పరిశుభ్రత అనేది ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎన్ఎస్ఎస్ రీజనల్ డైరెక్టర్ సంజయ్ అన్నారు. శుక్రవారం కడప ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు వైవీయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో కడప పాత బస్టాండ్ ఆవరణంలో స్వచ్ఛతా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాతబస్టాండ్ పరిసరాలను నాలుగు గంటలపాటు శ్రమదానం చేసి ప్లాస్టిక్ వస్తువులు, చెత్త వ్యర్థాలకు సంబంధించి 400 కేజీలు తొలగించారు. దీంతోపాటు స్థానికులను చైతన్యవంతులను చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సూర్యారావు, ఎన్ఎస్ఎస్ పీవోలు గోవిందరెడ్డి, షకీల, ప్రభుత్వ బాలుర కళాశాల ఎన్ఎస్ఎస్ పీవో రాజారావు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లతోపాటు, యూనివర్సిటీ అధికారులు పాల్గొన్నారు.

జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాన్ని నిర్మించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న వేణుగోపాల్

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రజల ఇబ్బందులు గుర్తించి నగరానికి దూరంగా ఉన్న రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ప్రజలకు అనుకూలంగా ఉన్న ప్రాంతంలో నిర్మించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గుంటి వేణు గోపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక బుద్ధ టౌన్‌షిప్‌లోగల జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను సీపీఐ నాయకులు కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రిజిస్ట్రేషన్ కార్యాలయానికి సొంత భవనం కేటాయించాలని అనేకమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. దీనికి కలెక్టర్ సానుకూలంగా స్పందించారని గుంటి వేణుగోపాల్ తెలిపారు.

పంటలలో పక్షి స్థావరాలను ఏర్పాటు చేయాలి



రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు

చింతకొమ్మదిన్నె : పంటలలో అక్కడక్కడ పక్షిస్థావరాలను ఏర్పాటు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని రసూల్‌పల్లె రైతు సేవాకేంద్రం పరిధిలోని పత్తి రైతు లక్ష్మిరెడ్డి పంటను శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. పలువురు రైతులకు సంబంధించిన ప్రతి పంటను సందర్శించి ప్రతి పంటలో తెల్ల దోమ, మెగ్నీషియం లోపాలను గుర్తించామన్నారు. వాటిని నివారించేందుకు పసుపు రంగు జిగురు అట్టలను ఎకరానికి 8 నుంచి 10 పెట్టుకోవాలన్నారు. ఈమెడలోపెడ్ మందును 0.4 ఎంఎల్ ఒక లీటరు నీటికి లేదా అసిటామి ప్రీడ్ 0.2 గ్రాములకు ఒక లీటరు నీటిని కలిపి పిచికారి చేయాలన్నారు. మెగ్నీషియం లోపానికి మెగ్నీషి యం సల్ఫేట్ ఐదు గ్రాములకు ఒక లీటరు నీటిని కలిపి పిచికారి చేయాలన్నారు. అలాగే పత్తి పంటను ఆశించే పురుగులను క్రమబద్ధీకరించేందుకు పంటలో అక్కడక్కడ కొన్ని పక్షి స్థావరాలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కే ఈశ్వర్ రెడ్డి, రైతు సేవా కేంద్రం సి బ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

• శాకంబరి అలంకారం



కడప కల్చరల్ : కడప నగరం మున్సిపల్ మైదానంలోని శ్రీ రాజరాజేశ్వరీ దేవాలయంలో అమ్మవారికి శుక్రవారం శాకంబరి అలంకారం చేశారు. ఆషాడ మాసం నాల్గవ శుక్రవారం అమ్మ వారికి ఇష్టమైనదిగా భావించి అర్చకులు పిడతల గోపాలకృష్ణశర్మ ఈ అంకారం చేశారు. ఈ సందర్భంగా 15 మంది భక్తులు పాతికకు పైగా కూరగాయలు, ఆకుకూరలను దండలుగా కూర్చి అమ్మవారి మూలమూర్తికి అలంకరించారు. పలుచోట్ల ఆకుకూరలను కూడా అలంకారంగా కూర్చారు. అనంతరం ఈ అలంకారంలో అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ ఈఓ శ్రీధర్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

• గాజులతో అలంకారం



కడప నగరం హనుమప్పవీధిలోని శ్రీ నడివీధి గంగమ్మకు శుక్రవారం గాజులతో కనుల పండువగా అలంకారం చేశారు. ఆషాడమాసంలో వచ్చే శుక్రవారం కావడంతో భక్తులు అమ్మవారికి మొక్కుల వారీగా రంగురంగుల గాజులను తెచ్చి మాలలుగా కూర్చి అలంకరించారు.

పేదల నివాసిత ప్రాంతాలలో వసతులు కల్పించండి



మాట్లాడుతున్న సీపీఐ నగర కార్యదర్శి వెంకట శివ

కడప వైఎస్ఆర్ సర్కిల్ : పేదలు నివాసమున్న కాలనీల్లో మౌలిక వసతులను మెరుగుపరిచి ఆ ప్రాంతాలను అభివృద్ధి చేయాలని సీపీఐ నగర కార్యదర్శి యస్. వెంకట శివ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక 14వ డివిజన్ ఎన్టీఆర్ నగర్ సీపీఐ శాఖ ముఖ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, బడుగు బలహీన వర్గాలు నివాసం ఉంటున్న కాలనీలు అనేకం నగరంలో ఉన్నాయని, అక్కడ తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, పారిశుద్ధ్యం తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఎన్టీఆర్ నగర్, ప్రకాష్ నగర్ మధ్య ఉన్న పెద్ద వరదనీటి కాలువను వెడల్పు చేయాలని పేదల ఇల్లు కూల్చిన రెవెన్యూ, కార్పొరేషన్ యంత్రాంగం తర్వాత ఈ వరద కాలువను అభివృద్ధి చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కనీసం ఈ కాలువలో పూడికను కూడా తీయకుండా, అపరిశుభ్రంగా దోమలకు నిలయంగా మార్చారన్నారు. సిమెంటు రోడ్లు నిర్మించేటప్పుడు ముందుగా సైడ్ మురుగునీటి కాలువలను నిర్మించకుండా వదిలేయడం వల్ల రోడ్లమీద మురికి నీటితో జనం అవస్థలు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి ఉద్దె మద్దిలేటి, నగర కార్యవర్గ సభ్యులు పగడ పూల మల్లికార్జున, సీపీఐ స్థానిక నాయకులు రాముడు, సాలమ్మ, దస్తగిరమ్మ, రమణమ్మ, బాష, సుధారాణి, సుంకమ్మ, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్గిల్ విజయ్ దివస్



ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో కార్గిల్ విజయ్‌దివస్

వైవీయూ : కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం కార్గిల్ విజయ్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీం బాషా మాట్లాడుతూ దేశం కోసం సైనికులు చేస్తున్న త్యాగాలను వివరించారు. కార్గిల్ యుద్ధంలో భారతదేశం సాధించిన విజయం, అమరులైన వారి కీర్తి ప్రతిష్టలను కొనియాడారు. అనంతరం పలువురు మాజీ సైనికులు సుబేదార్ ధరంవీర్‌సింగ్, హవల్దార్ రామ్‌లను సత్కరించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ కోఆర్డినేటర్ స్వరూపదేవి, శచీదేవి, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో..

కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో నిర్వహించిన కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ మాట్లాడుతూ 527 మంది సైనికుల ప్రాణత్యాగాలను స్మరించుకునేరోజు కార్గిల్ విజయ్ దివస్ అన్నారు. అనంతరం మాజీ సైనికులు కొండారెడ్డి, సీఎల్ రెడ్డి, ఇంద్రజిత్ సింగ్‌లను సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా. ఎం.రమేష్, ఎన్‌సీసీ అధికారులు డా. ఆర్. నీలయ్య, డా. నాగరాజు, లీలావర్ధిని, రాజశేఖర్‌రెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

క్యాంపస్ డ్రైవ్‌లకు స్పందన



ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళాలో ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

వైవీయూ : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాకు స్పందన లభించింది. 6 కంపెనీలు పాల్గొన్న ఈ మేళాకు వివిధ కళాశాలల నుంచి 149 మంది విద్యార్థులు ఈ మేళాకు హాజరుకాగా ప్రతిభ కనబరిచిన 63 మంది అభ్యర్థులను ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా. ఎం. రమేష్, జేకేసీ కోఆర్డినేటర్ రాము, మెంటార్లు సారథి, రవీంద్రారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ కళాశాలలో..

కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఐసీఐసీఐ బ్యాంకు ఆధ్వర్యంలో రిలేషన్‌షిప్ మేనేజర్ ఉద్యోగాలకు ఎంపికలు నిర్వహించారు. 63 మంది విద్యార్థినులు ఎంపికలకు హాజరుకాగా, ఐదురౌండ్లు ఇంటర్వ్యూల అనంతరం ప్రతిభ కనబరిచిన 13 మంది విద్యార్థినులను ఉద్యోగాలకు ఎంపికచేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా లెపపారు. కార్యక్రమంలో జేకేసీ కోఆర్డినేటర్ సుజాత, వరప్రసాద్, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

సుజికి నూతన వాహనం విడుదల



నూతన వాహనాన్ని విడుదల చేస్తున్న శివరామకృష్ణ, ఇతర సిబ్బంది

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలోని సుజుకి షోరూంలో సుజికి అవెనిస్ మొదటి వాహనాన్ని శుక్రవారం మార్కెట్‌లోకి విడుదల చేశారు. సుజికి మోటారు సైకిల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ రీజినల్ మేనేజర్ శివరామకృష్ణ కొనుగోలుదారులు విజయలక్ష్మి, వెంకట కల్యాణ్‌లకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుజుకి అవెనిస్ వాహనం సరికొత్త రంగుల్లో వినియోగదారులకు అందుబాటులోకి తీసుకు వచ్చామన్నారు. ఇప్పటికే మార్కెట్‌లో యువతకు నచ్చే విధంగా వాహనాలు విడుదల చేస్తున్నామన్నారు. అత్యాధునిక టెక్నాలజీతో కూడిన ఈ వాహనాన్ని ప్రజలు బుకింగ్ చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఏరియా సేల్స్ మేనేజర్ వై.శివప్రసాద్, ఖాజా సుజుకి షోరూం ఎండీ ఎస్ఎండీ సొహైల్, సేల్స్ జీఎం మహేంద్ర, నాయుడు, సర్వీసు జీఎం గోపాలకృష్ణ, సీఈఓ గౌస్, షోరూం ఫైనాన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ సహాయ సంచాలకులు నరసింహారెడ్డి

వీరపునాయునిపల్లె : రైతు సేవా కేంద్రం సిబ్బంది రైతులకు నిత్యం అందుబాటులో ఉండాలని కమలాపురం వ్యవసాయ సహాయ సంచాలకులు నరసింహారెడ్డి తెలిపారు. శుక్రవారం రైతు సేవా కేంద్రం సిబ్బందితో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రస్తుతం సాగులో ఉన్న పంటలపై తీసుకోవాల్సిన చర్యలపై వారికి తగు సలహాలు సూచనలు అందించాలని తెలియజేశారు. కౌలు రైతులను గుర్తించడంతో పాటు వారికి సకాలంలో పంట సాగు హక్కు పత్రాలను అందించాలన్నారు. అలా చేయడం వలన కౌలు రైతులకు పంట నష్ట పరిహారం, పంటల బీమా పొందేందుకు అర్హులవుతారన్నారు. అనంతరం గోనుమాకులపల్లెలో సాగులో ఉన్న వేరుశనల పంట, ఉరుటూరు గ్రామంలో సాగులో ఉన్న మినుము పంటలను పరిశీలించారు. బెట్ట పరిస్థితులు తట్టుకోవడానికి 20 గ్రాములు యూరియా లేదా 15–15–15 5 గ్రాముల చొప్పున లీటరు నీటికి కలపి పంటపై పిచికారి చేయాలన్నారు. వేరుశనగ పంటలో లద్దె పురుగు ఉధృతిని తగ్గించేందుకు థయోడికార్బ్ 200గ్రా, లేదా ఫ్లూబెండమైడ్ 40 మి.లీ, 2 వందల లీటర్లలో కలిపి పంటపై పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.